# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 154 18-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06







## ఎల్‌నినో ప్రభావం.. పంటల మార్పిడిపై సీఎం చంద్రబాబు దృష్టి

- పంటల మార్పిడి అవకాశాలను పరిశీలించాలని సూచన
- ప్రకృతి సేద్యం వైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశం
- పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై సమావేశాలకు నిర్దేశం
- కష్టకాలంలో రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టీకరణ



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానవనం, ఆక్వా రంగాలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, పంట మార్పిడి దిశగా రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులను పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా, ఈ అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి చైతన్య కార్యక్రమాల్లో తాను కూడా స్వయంగా పాల్గొంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని

2లో



## తరగతి గదుల్లో తెలంగాణ భవిష్యత్తు

- అప్పుడే భవిష్యత్ తరాల తలరాతలు మారతాయి
- సంక్షేమ పథకాలతో బతుకులు మారవు
- ఆరుట్ల టీపీఎస్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పీవీ, మోదీ, నేను కూడా ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్న వాళ్లమే..
- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణ
- విద్యార్థులకు యూనిఫాంతో పాటు 9 రకాల వస్తువులతో కూడిన కిట్‌లు
- బడి పిల్లలకు అల్పాహారం పంపిణీ పథకం ప్రారంభించిన సీఎం
- విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణించాలి
- పిల్లలతో కలిసి బ్రేక్‌ఫాస్ట్, ఫుట్‌బాల్

2లో

రంగారెడ్డి జిల్లా: 'ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదల బతుకులు మారవు. అవి కేవలం బతకడానికి మాత్రమే పనికొస్తాయి. భవిష్యత్ తరాల తలరాతలు మారాలంటే ముందు వారు చదువుకోవాలి. ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులుగా రాణించినప్పుడే బతుకులో మార్పు కన్పిస్తుంది. పుట్టి, పెరిగిన ప్రాంతానికి గుర్తింపు లభిస్తుంది. రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు రంగుల అద్దాల మేడలు, రంగుల గోడల్లో లేదు. తరగతి గదుల్లోనే ఉంది. విద్యార్థులు తమ

## భారత నావికుల భద్రతే ముఖ్యం



2లో

- జీ7 శిఖరాగ్ర సమావేశంలో మోదీ, ట్రంప్ కరచాలనం
- ఈ అంశాన్ని అమెరికా, ఇరాన్ శాంతి ఒప్పందంలో చేర్చాలి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోదీ విజ్ఞప్తి
- ఫ్రాన్స్‌లో జీ7 శిఖరాగ్ర భేటీ సందర్భంగా సమావేశమైన ఇరువురు నేతలు
- హార్ముజ్ జలసంధిని తెరిచి ఉంచాలన్న ప్రధాని మోదీ
- పశ్చిమాసియా సంఘర్షణ ముగింపునకు ట్రంప్ కృషి చేస్తున్నారని ప్రశంసలు
- వాణిజ్య చర్చల్లో మోదీ చాలా కఠినంగా ఉంటారన్న ట్రంప్...

భారత్ ఒక పెద్ద పాత్రను పోషించబోతోందని స్పష?టకరణ

- వాణిజ్య ఒప్పందంపై చాలా సమీపంలోకి వచ్చేశామని ప్రకటన
- ఒమన్ తీరంలో ముగ్గురు భారతీయుల మృతి పట్ల ట్రంప్ సంతాపం

ఎవియన్--లెస్--బెయిన్స్: హార్ముజ్ జలసంధి సహా అంతర్జాతీయ సముద్ర రవాణా మార్గాల్లో భారత నావికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. బుధవారం ఫ్రాన్స్‌లో జీ7 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నావికుల భద్రత అంశాన్ని మోదీ ప్రస్తావించారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ఆ ప్రాంతంలో భారత నావికులకు ఎదురవుతున్న ఇబ్బందులను ట్రంప్ దృష్టికి తీసుకెళ్లారు.




## కాంగ్రెస్ పాలన డిజాస్టర్

**ఆరు గ్యారంటీల జేమ్స్ బాండ్లు ఎటుపోయారు?**

**ఎస్ఐఆర్‌పై పాలేరు నియోజకవర్గ శ్రేణుల సమావేశంలో కేటీఆర్**

ఖమ్మం: 'కాంగ్రెస్ హయాంలో సంక్షేమం దారి తప్పి అభివృద్ధి కుంటుపడి పాలన డిజాస్టర్‌గా నిలిచింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు హిట్లర్ స్ఫూర్తి అంటాడు. ఎవడన్నా బుద్ధి ఉన్నోడు రావణాసురుడు, నరకాసుడు స్ఫూర్తి అంటాడా? ఆ వ్యాఖ్యలతోనే

2లో



## భారత విద్యా వ్యవస్థ పిల్లల్ని అణచివేస్తోంది

**కోటా ర్యాలీలో రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్యలు**

భారతదేశ విద్యా వ్యవస్థ పిల్లలపై విపరీతమైన ఒత్తిడిని పెంచి వారిని నలిపేస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. కోటా ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడారు.

2లో

## 'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లు తొలగించే అవకాశం ఉంది

**'సర్'తో ముస్లింలను టార్గెట్ చేస్తారన్న అజారుద్దీన్**

**ప్రజలు తమ ఓట్లను కాపాడుకోవాలని సూచన**

**తనకు తెలుగు చదవడం, రాయడం వచ్చని వెల్లడి**



2లో



2లో

## పవన్ కల్యాణ్ గారు.. సీబీఐ విచారణకు ఆదేశించండి: అంబటి రాంబాబు

- సాయికృష్ణను లాకప్ డెత్ చేశారన్న అంబటి
- పోలీసులు హత్య చేసి శవాన్ని మాయం చేశారని ఆరోపణ
- పవన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్న

23 ఏళ్ల యువకుడు గాదె సాయికృష్ణను లాకప్ డెత్ చేశారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. "సాయికృష్ణను పోలీసులు హత్య చేసి శవాన్ని మాయం చేశారు. దేశంలో ఇంత ఘోరమైన లాకప్ డెత్ ఎక్కడా జరగలేదు" అని ఆరోపించారు. "సాయికృష్ణ

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- హనుమకొండ పర్యటనకు సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- తెలంగాణ పోలీసు శాఖకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన పవన్
- తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని ట్వీట్
- నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన ఈరోజు వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు.దకొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు, తాను ఓ అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌ను కలవడమే తన కోరిక అని పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియో పవన్ దృష్టికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని



2లో

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఆకాంక్షను నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు నేరుగా హనుమకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో కదిలించిందని పవన్ పేర్కొన్నారు. "అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో నిరంజన్ అసాధారణ ధైర్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అతని మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ తన పోస్టులో వివరించారు.

**తెలంగాణ ప్రభుత్వానికి, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు**

ఈ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, తనకు పూర్తి సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి అభిమానం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని, వారి మమకారాన్ని జీవితాంతం తన హృదయంలో నిలుపుకొంటానని పవన్ భావోద్వేగంగా రాశారు. చివరగా "ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను" అంటూ అభిమానికి భరోసా ఇచ్చారు.

## భారత విద్యా వ్యవస్థ పిల్లల్ని అణచివేస్తోంది

నేడు ఎంతో మంది యువ ఆశావహులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ఏ విద్యార్థి కూడా ఎదుర్కోకుండా ఉండేందుకు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం రాజకీయ సమావేశం కాదు... విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన వేదిక అన్నారు. ఈ సమావేశం మీ గురించి.. భవిష్యత్ కోసం పోరాడుతున్న యువత కోసమే అని తెలిపారు.

ఇక ప్రసంగానికి ముందు ముగ్గురు అమ్మాయిలను, ఇద్దరు అబ్బాయిలను వేదికపైకి ఆహ్వానించారు. నీట్, జేఈఈ, సివిల్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల కలలను, ఆకాంక్షలను ప్రోత్సహించడంలో దేశ విద్యా వ్యవస్థ విఫలమవ్వడమే అతి పెద్ద బలహీనత అన్నారు. "ప్రతి విద్యార్థి డాక్టరో.. ఇంజనీరోనో ఎందుకు అవ్వాలి?." అని విద్యా వ్యవస్థను రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

## కాంగ్రెస్ పాలన డిజాస్టర్

ఆయన నిజస్వరూపం బయటపడింది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులకు ఎస్ఆర్ఐపై బుధవారం శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా కేటీఆర్ తన ప్రసంగంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మలపై ధ్వజమెత్తారు.

**మంత్రుల అనుచరుల దందా కోసం..**

ఖమ్మం వెలుగుమట్లలో పేదలు కట్టుకున్న వేయి ఇళ్లను రాత్రికి రాత్రి ప్రభుత్వం రాక్షసంగా కూల్చేసిందని తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల అనుచరుల రియల్ ఎస్టేట్ దందా, సీఎం పైశాచికానందం కోసం ఆడబిడ్డలను రోడ్డున పడేశారన్నారు. రాష్ట్ర ఆదాయం పడిపోతుంటే ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల అవినీతి సామ్రాజ్యం మాత్రం వేల రెట్లు పెరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. పొంగులేటి ములుగు జిల్లాలో రూ.4 వేల కోట్ల విలువైన ఇసుక దోచుకుంటున్నారని విమర్శించారు.

**సంక్షోభంలో వ్యవసాయ రంగం**

వ్యవసాయ రంగం, రైతాంగం సంక్షోభంలో ఉందని.. పంట చేతికొచ్చి 60 రోజులు దాటినా ధాన్యం కొనే దిక్కులేదని కేటీఆర్ తెలిపారు. వ్యవసాయ మంత్రి తుమ్మల రైతుల శ్రేయస్సును గాలికొదిలేస్తే.. డిప్యూటీ సీఎం కమీషన్ల దందాల్లో జోరుగా ఉన్నారని ఆరోపించారు. 'ప్రభుత్వానికి ఇంటర్వెల్ (రెండున్నరేళ్లు) అయిపోయింది.. ఫస్ట్ హాఫ్ మొత్తం అట్టర్ డిజాస్టర్'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'హౌసింగ్ మంత్రిగా ఉన్న పొంగులేటి.. 20 లక్షల ఇళ్లు కట్టించాకే మీ గుమ్మానికి వచ్చి ఓట్లు అడుగుతాం'అని అంటున్నారని.. ఆ మాట మీద నిలబడే దమ్ము ఉందా అని కేటీఆర్ సవాల్ విసిరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బాండ్ పేపర్లు రాసి ఆరు గ్యారంటీల కార్డులను 99 రోజులు భద్రంగా దాచుకోమన్నారని.. ఇప్పుడు ఆ కార్డులను ఎక్కడ పెట్టుకోవాలో చెప్పాలని కేటీఆర్ నిలదీశారు. పేదల కళ్లలో ఆనందం చూడాలనే ఉద్దేశం, రాష్ట్ర అభివృద్ధి కోసం నాడు సీఎంగా కేసీఆర్ అప్పు చేశారని కేటీఆర్ అన్నారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి గోదావరి నీళ్లు తెస్తే, ఖమ్మం జిల్లా రైతుల కోసం సీతారామ ప్రాజెక్టును 80 శాతం కట్టించి, భక్త రామదాసు ప్రాజెక్టును 9 నెలల్లోనే పూర్తి చేశారన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, నేతలు లింగాల కమల్‌రాజ్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.




## భారత నావికుల భద్రతే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

వారికి భద్రత కల్పించే అంశాన్ని ఇరాన్‌తో ప్రతిపాదించిన శాంతి ఒప్పందంలో చేర్చాలని కోరారు. ఇటీవల ఒమన్ తీరంలో వాణిజ్య నౌకలపై అమెరికా సైన్యం వైమానిక దాడులకు పాల్పడడంతో ముగ్గురు భారతీయులు మరణించిన సంగతి తెలిసిందే. దీనిపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అమెరికా దుశ్చర్యను ప్రజలు ముక్తకంఠంతో ఖండించారు. అమెరికా దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి చెందితే మోదీ ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే భారత నావికుల భద్రత గురించి ట్రంప్‌తో భేటీలో మోదీ ప్రధానంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వారిద్దరూ భారత్, అమెరికా సంబంధాలు, ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

పశ్చిమాసియా సంఘర్షణను ముగించడానికి డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న కృషిని ప్రధాని మోదీ అభినందించారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరే శాంతి ఒప్పందంలో భారత నావికుల భద్రతకు సంబంధించిన నిబంధనలు ఉంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. హార్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమని స్పష్టంచేశారు. అక్కడ ఎల్లప్పుడూ స్వేచ్ఛాయుత నౌకాయానానికి అనుకూల పరిస్థితులు ఉండాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సముద్ర వాణిజ్య మార్గాల్లో లక్షలాది మంది భారతీయ నావికులు పనిచేస్తున్నారని, వారి భద్రత తమ అత్యంత కీలకమని వివరించారు. అమెరికా, ఇరాన్ ఒప్పందంతో వారి భద్రతకు కచ్చితమైన హామీ లభిస్తుందని ఆశిస్తున్నట్లు మోదీ తెలిపారు. వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సాంకేతికత, ప్రజల మధ్య సంబంధాల వంటి అంశాల్లో ద్వైపాక్షిక సహకారం విషయంలో సాధించిన పురోగతిని తాము సమీక్షించామని వెల్లడించారు. భారత ప్రధాని మోదీతో అద్భుతమైన సమావేశం జరిగిందని డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటించారు. మోదీపై ప్రశంసల జల్లు కురిపించారు. సమీప భవిష్యత్తులో భారత్‌లో పర్యటిస్తానని చెప్పారు. "మోదీ చాలా మంచి మనిషి, సౌమ్యుడు, నెమ్మదస్తుడు అని అంటుంటారు. మోదీ అత్యంత అందమైన వ్యక్తి. చూడ్డానికి చాలా బాగుంటారు. అచ్చం దేవదూతలా కనిపిస్తారు. మోదీని చూసి అందరూ ఆశ్చర్యపోతుంటారు. కానీ, నిజానికి నా దృష్టిలో ఆయన చాలా కఠినమైన వ్యక్తి, ఒక కిల్లర్. వ్యాపారం, వాణిజ్య చర్చల్లో మోదీ చాలా కఠినంగా, నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. ఆయనకు భారతీయ ప్రజలంటే ఇష్టం, అలాగే అమెరికా అంటే కూడా ఇష్టమే"అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారతదేశాన్ని ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా అభివరి?ణంచారు. "మోదీ ప్రధానమంత్రిగా ఉన్నంత కాలం ప్రతి విషయంలోనూ భారత్ కీలక పాత్ర పోషిస్తుందని నేను భావిస్తున్నా. భారత్ ఒక పెద్ద పాత్రను పోషించబోతోంది. నేను వైట్‌హౌస్‌లో ఉన్నంత కాలం అమెరికాలో భారత్‌కు ఒక మంచి మిత్రుడు(ట్రంప్) ఉంటారు. ఒమన్ తీరంలో జరిగిన దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించిన విషయం నాకు తెలిసింది. వారికి నా సంతాపం తెలియజేస్తున్నా. అది చాలా కఠినమైన వృత్తి, అందులో ఎలాంటి సందేహం లేదు. భారత్‌తో మేము కలిసి పనిచేస్తాం. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం విషయంలో మేము చాలా సమీపంలోకి వచ్చేశాం. ఉద్యోగాలు, ఉపాధి విషయంలోనూ రెండు దేశాలు చక్కగా సహకరించుకుంటున్నాయి"అని ట్రంప్ వివరించారు. 2020లో భారత్‌లోని అహ్మదాబాద్‌లో తనకు లభించిన గౌరవాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. తనను చూసేందుకు భారీగా జనం తరలివచ్చారని, అది తనకు 'గొప్ప సమయం'అని చెప్పారు. ఎవియన్--లెస్--బెయిన్స్: భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం జూలై 15వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ బుధవారం ప్రకటించారు. వారు ఫ్రాన్స్‌లో జీ7 భేటీ సందర్భంగా సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య సంబంధాలతోపాటు ఒప్పందం అమలుపై చర్చించారు. ఈ ట్రేడ్ డీల్ భారత్--యూకే సంబంధాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయి అని మోదీ అభివరి?ణంచారు. ఇది వచ్చే నెల 15న అమల్లోకి రానుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈమేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. ప్రధాని మోదీ జర్మన్ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్‌తో సమావేశమయ్యారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలోని పరిస్థితులు, రష్యా--ఉక్రెయిన్ సంఘర్షణపై కూడా ఇద్దరు నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్, జర్మనీలు కేవలం వాణిజ్య రంగంలోనే కాకుండా, భవిష్యత్తుకు సంబంధించిన వివిధ అత్యాధునిక సాంకేతిక రంగాల్లో కూడా సన్నిహితంగా సహకరించుకుంటున్నాయని మోదీ వివరించారు. యూరోపియన్ యూనియన్ అగ్రనేత ఉర్సులా వాన్ డెర్ లేయెన్, ప్రధాని మోదీ కూడా సమావేశమయ్యారు. రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరువురు నాయకులు నిర్ణయించుకున్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. పంటల మార్పిడిపై సీఎం చంద్రబాబు దృష్టి

అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పొగాకు కొనుగోలుదారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అధిక డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు విలువ జోడింపు అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఆక్వా రైతులు, ఫీడ్ తయారీదారుల సమస్యల పరిష్కారానికి వారితోనూ సమావేశం కావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### పవన్ కల్యాణ్ గారు.. సీబీఐ విచారణకు ఆదేశించండి: అంబటి రాంబాబు

మేనమామ నవరంగ్ నా దగ్గరకు వచ్చి జనసేన కార్యకర్తనని చెప్పారు. సాయికృష్ణ తల్లి వేదన ఎవరినైనా కలచివేస్తుంది. పార్టీలకు అతీతంగా ఈ అంశంపై ఉద్యమం చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ అంశంపై సీబీఐ ఎంక్వైరీ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. "పవన్ కల్యాణ్‌కు చేతులు జోడించి వేడుకుంటున్నాను. సీబీఐ విచారణకు ఆదేశించండి. మనం మానవులం కదా" అని అన్నారు. సాయికృష్ణ మేనమామ నవరంగ్ మీడియాతో మాట్లాడుతూ... "ఈ విషయాన్ని పార్టీలకు ముడిపెట్టడం సరికాదు.

## 'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లు తొలగించే అవకాశం ఉంది



'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను ఉపయోగించి ముస్లింల ఓట్లను తొలగించే అవకాశం ఉందని తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఈరోజు గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి అజారుద్దీన్... 'సర్' అందరికీ వర్తించే అంశమే అయినా, ముస్లింల ఓట్లనే టార్గెట్ చేస్తారు అని ఆరోపించారు. పశ్చిమబెంగాల్, బీహార్‌లలో ముస్లింల ఓట్లు తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలోనూ అలాంటి కుట్రలు జరగవచ్చని హెచ్చరించారు. 'సర్' ప్రక్రియలో తొలగించే ఓట్ల మీదే ఎన్నికల ఫలితాలు ఆధారపడతాయని, ప్రజలు తమ ఓట్లను స్వయంగా కాపాడుకోవాలని మంత్రి సూచించారు. తాను తెలుగులో మాట్లాడటం కొంత ఇబ్బందిగా ఉంటుందని అజారుద్దీన్ స్పష్టం చేశారు. "తెలుగు చదవడం, రాయడం వచ్చు. చిన్నప్పుడు ప్రాక్టీస్ చేశాను. కానీ మాట్లాడటం సులభంగా ఉండదు. తప్పులు వస్తే ఇబ్బందిగా ఉంటుంది. సులభంగా ఉండే భాషలోనే మాట్లాడతాను" అని వివరించారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అద్భుతమైన పాలన అందిస్తున్నామని మంత్రి వ్యాఖ్యానించారు. విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, కేసీఆర్ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నామని తెలిపారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 200 మందికి పైగా ప్రజల సమస్యలు పరిష్కరించానని, పబ్లిసిటీపై తనకు మోజు లేదని అన్నారు.

## తరగతి గదుల్లో తెలంగాణ భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బతికేలా విద్యలో రాణించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువును చిన్నతనంగా భావించొద్దు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నప్పటికీ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నా. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, ప్రస్తుత ప్రధాని మోదీ కూడా ప్రభుత్వ స్కూళ్లల్లోనే చదువుకుని రాణించిన వాళ్లే..'అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బడి పిల్లలకు అల్పాహారం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అటు నుంచి నేరుగా కిచెన్‌కు వెళ్లి పూరీని వొత్తారు. లైబ్రరీ, ప్రయోగశాల, మ్యూజిక్, డ్యాన్స్ తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. క్రీడామైదానానికి చేరుకుని పిల్లలతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. విద్యార్థులు, టీచర్లతో కరచాలనం చేశారు. గ్రూప్ ఫొటోలు దిగారు. అనంతరం బహిరంగసభలో ప్రసంగించారు.

**మట్టిలో మాణిక్యాలను వెలికితీసేలా..**

'విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నాం. పదేళ్ల పాలనలో విధ్వంసమైన విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించేందుకే టీపీఎస్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది అడ్మిషన్లు పొందారు. ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి వచ్చింది. ఇదే విధంగా తెలంగాణలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక టీపీఎస్ నుంచి ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నాం. ఆరుట్ల గ్రామం తెలంగాణకు ఆదర్శంగా నిలుస్తుందని విశ్వసిస్తున్నా. ఇక్కడ ప్రారంభించిన టీపీఎస్‌ను ఇతర ప్రభుత్వ పాఠశాలలకు అంకితం చేస్తున్నాం. ఈ స్ఫూర్తి ఆరుట్ల గ్రామానికే కాదు..తెలంగాణలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులది. ఒకప్పుడు ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేవి కాదు. ప్రస్తుతం విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంతో పాటు 9 రకాల వస్తువులతో కూడిన కిట్‌లు అందించే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. రూ.685 కోట్లతో టెండర్ పిలిస్తే..రూ.3 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారు. జూలై ఆఖరి వరకు విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర వస్తువులు అందజేస్తాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా కుల,మతాలకు అతీతంగా 500 మంది విద్యార్థులను ఒకేచోట చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. డిసెంబర్ 9న యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీని ప్రారంభించనున్నాం..'అని సీఎం తెలిపారు.

**మెస్సీని తెస్తే విమర్శించారు..**

'2034 ఒలింపిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేశాం. అకాడమీల్లో ఆడే వాళ్ల కంటే..ఆరుట్ల స్కూలు పిల్లలు బాగా ఆడుతున్నారు. ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ, విద్యార్థులను కలిపి ఫుట్‌బాల్ ఆడించాం. క్రీడలను ప్రోత్సహించేందుకు మెస్సీని తీసుకొస్తే రాజకీయ విమర్శలు చేశారు. కడుపులో కుళ్లు పెట్టుకుని రాజకీయం చేయాలని భావించే వారికి భవిష్యత్తు ఉండదు. ప్రతిపక్ష హోదా కూడా దక్కదు..'అని రేవంత్ ధ్వజమెత్తారు.

**డ్రగ్స్ రహిత సమాజం కోసం 19న ప్రతిజ్ఞ**

'తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ సమస్యగా మారాయి. సరదాగా మొదలైన అలవాటు ఆ తర్వాత వాటికి బానిసలుగా మార్చుతుంది. డ్రగ్స్, గంజాయి రహిత సమాజం కోసం ఈ నెల 19న ఎల్బీనగర్‌లో వేలాది మంది విద్యార్థులతో ప్రమాణం చేయించబోతున్నాం. విద్యార్థులు తమ తోటి విద్యార్థులు ఎవరైనా గంజాయి, డ్రగ్స్‌కు అలవాటైతే ఆ విషయం వెంటనే ఉపాధ్యాయుల ద్వారా పోలీసులకు చేరవేయాలి. పోలీసులకు మీరే సమాచార వారధులుగా నిలవాలి..'అని సీఎం కోరారు.

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలో ఉన్న పేదల భూములకు విముక్తి కల్పించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, ఇతర నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. నాగన్‌పల్లి సర్వే నంబర్ 189లోని పన్నెండెకరాల నాలుగు గుంటల భూమి, 203 సర్వే నంబర్‌లో ఎనిమిదెకరాల భూమిలో 2007లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని సీఎంకు తెలిపారు

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




# ప్రీ ప్రైమరీ పోస్టులకు 111 దరఖాస్తులు

- 8 ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు 85, 8 ఆయా పోస్టులకు 26 దరఖాస్తులు
- త్వరలో ప్రత్యేక కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ: ఎంఈఓ



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలంలోని ఎనిమిది గ్రామాల్లో మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూల్‌లలో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి మొత్తం 111 దరఖాస్తులు అందినట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా, నిర్ణీత గడువులో అభ్యర్థులు అధిక సంఖ్యలో దరఖాస్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు. మండలంలోని సింగారం, పాముకుంట, పుట్టగూడెం, బొందుగుల, దూది వెంకటాపురం, రఘునాథపురం, చల్లూరు, బేగంపేట గ్రామాల్లో ప్రీ ప్రైమరీ స్కూల్‌లు మంజూరైనట్లు తెలిపారు. మొత్తం 8 ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు 85 దరఖాస్తులు, 8 ఆయా పోస్టులకు 26 దరఖాస్తులు అందాయని వివరించారు. గ్రామాల వారీగా దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. సింగారం పాఠశాలకు ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 7, ఆయా పోస్టుకు 4 దరఖాస్తులు వచ్చాయి. పాముకుంట గ్రామానికి ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 16, ఆయా పోస్టుకు 4 దరఖాస్తులు అందాయి. పుట్టగూడెంలో ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 6, ఆయా పోస్టుకు 2 దరఖాస్తులు రాగా, బొందుగులలో ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 15, ఆయా పోస్టుకు 5 దరఖాస్తులు వచ్చాయి. దూది వెంకటాపురంలో ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 9, ఆయా పోస్టుకు 5 దరఖాస్తులు అందగా, రఘునాథపురంలో ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు అత్యధికంగా 17, ఆయా పోస్టుకు 3 దరఖాస్తులు వచ్చాయి. చల్లూరులో ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 6, ఆయా పోస్టుకు 2 దరఖాస్తులు అందగా, బేగంపేటలో ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 9, ఆయా పోస్టుకు కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు ఎంఈఓ తెలిపారు. పోస్టుల భర్తీకి సంబంధించి త్వరలో ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. దీంతో ఎంపిక కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## బాత్‌రూమ్‌లో జారిపడి మధ్యప్రదేశ్ కూలీ మృతి

- జీవనోపాధి కోసం వచ్చి అనంతలోకాలకు..
- రాజాపేట పోలీసుల కేసు నమోదు

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో జారిపడి ఓ వలస కూలీ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్ ప్రసాద్ అనురాగి (40) జీవనోపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం రాజాపేటకు వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఈ నెల 15న (సోమవారం) ఉదయం ఓ వివాహ వేడుకకు వెళ్లేందుకు ఆయన స్నానం చేస్తుండగా, బాత్‌రూమ్‌లో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై నోటి నుంచి రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు తక్షణమే అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి బంధువు విపిన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## మేనిఫెస్టో హామీలను అమలు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ మండల సమావేశంలో డిమాండ్
- జులై నుంచి ఉద్యమ కార్యాచరణ: మధుసూదన్, మహేందర్



**తొలివెలుగు, రాజాపేట:** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ డిమాండ్ చేసింది. రాజాపేట మండల కేంద్రంలో బుధవారం యూటీఎఫ్ మండల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్, మహేందర్ మాట్లాడారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో ఉపాధ్యాయులకు నూతన వేతన స్కేళ్లను అమలు చేయాలని కోరారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ (కరువు భత్యం)లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జులై నెల నుంచి ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా బాధ్యులు జె.కరుణాకర్, సీనియర్ కార్యకర్తలు మహిపాల్ రెడ్డి, లెనిన్, రామకృష్ణ, మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- భీమనపల్లి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన సీపీఎం బృందం
- జాప్యంపై రైతుల ఆందోళన



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని మరో నాలుగు రోజుల్లోగా పూర్తిగా సేకరించాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని భీమనపల్లి గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం నాయకులు సందర్శించి, కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు కేవలం 50 శాతం మాత్రమే ధాన్యం సేకరించడంపై అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రెండు నెలలుగా రైతులు కేంద్రాల్లోనే ధాన్యపు కుప్పలపై కాపలాగా ఉంటూ వడగాల్పులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కొనుగోళ్లను పర్యవేక్షించడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాబోయే నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, మండల కమిటీ సభ్యులు కలుకూరి బిక్షపతి, శాఖ కార్యదర్శి గూని మల్లేష్, నాయకులు ఉప్పునూతల యాదగిరి, రైతులు సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, నరేష్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

- నాలుగు విడతల్లో లబ్ధిదారుల గుర్తింపు
- రూఫ్ రీప్లేస్‌మెంట్‌కు అవకాశం: హౌసింగ్ పీడీ లక్క అలివేలు
- రాజాపేట ఏఈ వివేకానంద్ గౌడ్ పనితీరుపై ప్రశంసలు





**తొలివెలుగు, రాజాపేట:** ఆలేరు నియోజకవర్గానికి రెండో విడతలో 2 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, రాబోయే పది రోజుల్లో నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఎంపిక కోసం సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ లక్క అలివేలు తెలిపారు. బుధవారం రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలో గెజిటెడ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని హౌసింగ్ ఏఈ వివేకానంద్ గౌడ్‌ను అడిగి తెలుసుకున్న పీడీ, ఆయన పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రెండో విడత మార్గదర్శకాల్లో కొన్ని నిబంధనలు సడలించామన్నారు. రూఫ్ రీప్లేస్‌మెంట్ (పైకప్పు మార్పిడి) కింద గట్టి గోడలు ఉండి పెంకులు లేదా రేకుల కప్పు ఉన్న ఇళ్లకు స్లాబ్ వేసుకోవడానికి రూ.2 లక్షలు మంజూరు చేస్తామన్నారు. బేస్‌మెంట్ దశలో ఉన్న ఇండ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు చెల్లిస్తామని, ఇందుకు 200 నుండి 600 చదరపు అడుగుల (ఎస్ఎఫ్టీ) స్థలం ఉండాలని స్పష్టం చేశారు. మొదటగా గుడిసెలలో నివసించే వారికే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.


**నమిలలో గుడిసెల పరిశీలన:**

సమావేశం అనంతరం నమిల గ్రామం, దాని అనుబంధ గ్రామమైన పిట్టలగూడెంలో గల గుడిసెలను పీడీ అలివేలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిట్టలగూడెంలో 50, నమిలలో 8 గుడిసెల నివాసితుల అర్హతలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులి రాజు, ఉప సర్పంచ్ మార్క శివకుమార్, మాయకోటి రాజు, బొమ్మగాని శ్రీను, సీలేవేరు బాలరాజు గౌడ్, ఏఈ వివేకానంద్ గౌడ్, కార్యదర్శి జమీల్ తదితరులు పాల్గొన్నారు.

# చల్లూరు లేఅవుట్ రద్దుకు ఆదేశం.. లబ్ధిదారుల్లో ఆందోళన!

- వాస్తవాలు దాచి అనుమతి పొందినట్లు డీటీసీపీ నిర్ధారణ
- ఉత్తర్వుల అమలుపై మార్గదర్శకాలు కోరిన పంచాయతీ కార్యదర్శి
- కొనుగోలుదారుల హక్కులపై నెలకొన్న అనిశ్చితి

### చల్లూరు లేఅవుట్ రద్దు: ఆందోళనలో కొనుగోలుదారులు!




**తొలివెలుగు, రాజాపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ వివాదాస్పద లేఅవుట్ అనుమతిని రద్దు చేయాలని ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నిర్ణయంతో ఆ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన సుమారు 600 మంది యజమానులు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**హైకోర్టుకు చేరిన వివాదం:**

అధికారిక సమాచారం ప్రకారం, చల్లూరు గ్రామ పరిధిలోని కొన్ని సర్వే నంబర్లలో 'శ్రీ కన్‌స్ట్రక్షన్స్' సంస్థకు 2019లో డీటీసీపీ అనుమతి (డీటీఎల్‌పీ నెం.112/2019/హెచ్) లభించింది. అయితే అనుమతి పొందే సమయంలో సర్వే నంబర్ 322/పిలోని 15 ఎకరాల భూమికి సంబంధించిన కీలక విక్రయ వివరాలను దరఖాస్తుదారులు గోప్యంగా ఉంచినట్లు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖ గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై వచ్చిన ఫిర్యాదు హైకోర్టు దృష్టికి వెళ్లగా, లేఅవుట్ నిబంధనల్లోని షరతు నంబర్--15 ప్రకారం తప్పుడు సమాచారం లేదా వాస్తవాలను దాచిపెట్టి అనుమతులు పొందినట్లు తేలితే ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని అధికారులు పేర్కొన్నారు. జీవో ఎంఎస్ నెం.67 నిబంధనల మేరకు సదరు లేఅవుట్‌ను రద్దు చేసి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారి చల్లూరు, దాతర్‌పల్లి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు సమాచారం.

**కార్యదర్శి లేఖతో కొత్త మలుపు:**

లేఅవుట్ రద్దు ఉత్తర్వుల అమలుకు సంబంధించి చల్లూరు పంచాయతీ కార్యదర్శి డీటీసీపీ అధికారులకు పంపిన లేఖ ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకుంది. లేఖలో పలు చట్టపరమైన, పరిపాలనా అంశాలను ప్రస్తావించారు. 2019 నుంచి 2025 మధ్యకాలంలో వెంచర్‌లో దాదాపు 600 ప్లాట్లు వివిధ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ అయ్యాయని, దీంతో కొనుగోలుదారులకు మూడో పక్ష హక్కులు సంక్రమించాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో నేరుగా రద్దు చర్యలు చేపడితే చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, సహజ న్యాయ సూత్రాల ప్రకారం బాధితులకు ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరాల్సిన అవసరం ఉందని, అలా చేయకుండా రద్దు చేస్తే కొనుగోలుదారులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశముందని లేఖలో వివరించారు.

**మార్గదర్శకాల కోసం విజ్ఞప్తి:**

ముందస్తు నోటీసులు లేకుండా రద్దు ప్రక్రియ చేపడితే కోర్టు ధిక్కరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని కార్యదర్శి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారి హక్కులకు భంగం కలగకుండా ప్రతి యజమానికి 15 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వాలా లేదా అనే అంశంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. అలాగే, అవసరమైతే షరతులతో కూడిన రద్దు విధానాన్ని పరిశీలించాలని సూచించినట్లు తెలిసింది. ఈ పరిణామాలతో లేఅవుట్ రద్దు ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**అయోమయంలో కొనుగోలుదారులు:**

ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వందలాది మంది మధ్యతరగతి కుటుంబాలు తమ పెట్టుబడుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అధికారుల తదుపరి నిర్ణయాలు, కోర్టు పరిణామాలపై అందరి దృష్టి నెలకొంది. చల్లూరు లేఅవుట్ వ్యవహారంలో ప్రభుత్వం, సంబంధిత శాఖలు తీసుకునే నిర్ణయాలు సుమారు 600 మంది ప్లాట్ల యజమానుల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## లోతుకుంట గర్ల్స్ హాస్టల్‌ను పరిశీలించిన ఎంపీడీవో

- రికార్డుల తనిఖీ.. విద్యార్థినులకు దిశానిర్దేశం
- పరిశుభ్రత పాటించాలని అధికారులకు సూచన

**తొలివెలుగు, వలిగొండ:** లోతుకుంటలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని (గర్ల్స్ హాస్టల్) మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జి. జలంధర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అనంతరం వసతి గృహానికి సంబంధించిన వివిధ రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్లను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హాస్టల్ ప్రాంగణం, వసతి గదులు, స్టోర్ రూమ్, తరగతి గదులను తిరుగుతూ పరిశుభ్రత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వసతి గృహంలో కొత్తగా చేరిన విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి, వసతులు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## వలిగొండ పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలి

- ఆసుపత్రిని సర్వే చేసిన సీపీఎం బృందం
- వైద్యులు, సిబ్బంది కొరతను తీర్చాలని డిమాండ్



**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) తక్షణమే 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని మౌలిక వసతులు, వైద్య సేవలపై ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 10 వేల జనాభా కలిగిన వలిగొండ పట్టణంలో ప్రస్తుతం పీహెచ్‌సీ కేవలం 8 పడకలతోనే నడుస్తోందని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండాల్సి ఉండగా ఒకరే విధులు నిర్వహిస్తున్నారని, ఖాళీగా ఉన్న రెండో పోస్టును భర్తీ చేయాలన్నారు. మందుల పంపిణీకి ఫార్మసిస్ట్ లేకపోవడం, జీతాలు రాక రాత్రి వేళల్లో వాచ్‌మెన్ అందుబాటులో లేకపోవడం సరికాదన్నారు. ఆసుపత్రి మూత్రశాలల్లో నీటి వసతి లేక, స్కావెంజర్ పోస్టు ఖాళీగా ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, దీనివల్ల రోగులు మరింత అనారోగ్యానికి గురవుతున్నారని విమర్శించారు. వలిగొండ సబ్ సెంటర్‌కు నూతన భవనం నిర్మించాలని, ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, మూడు ఆశా కార్యకర్తల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు కొండూరు సత్తయ్య గౌడ్, ధ్యానబోయిన యాదగిరి, స్థానికులు యాదమ్మ, అమృతమ్మ, నరసింహ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఓనమాలు దిద్దిన చిన్నారులు

- సింగారంలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం
- ప్రభుత్వ బడిలో చేరిన 20 మంది నూతన విద్యార్థులు

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా సింగారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి చిన్నారుల చేత ఓనమాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో మొదటి రోజునే పాఠశాలలో ఒకటవ తరగతిలో 20 మంది నూతన విద్యార్థులు చేరడం పట్ల అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అంతకుముందు సరస్వతీ దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించి వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. చిన్నారులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ ప్రమీల, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కటికెల సంధ్య, ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు అనిత, కొండా పండరి, సీఆర్పీ వెంకట్‌రెడ్డి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి విద్యాభ్యాసం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# బాధిత కుటుంబానికి 'బీర్ల ఫౌండేషన్' అండ

- మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత
- కష్టకాలంలో ఆదుకోవడం అభినందనీయం: స్థానికులు



**తొలివెలుగు, రాజాపేట:** బతుకుదెరువు కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ అండగా నిలిచింది. రాజాపేట మండలంలోని సోమారం గ్రామానికి చెందిన బల్లెం సుగుణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం స్థానిక నాయకుల ద్వారా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దృష్టికి చేరింది. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత సౌజన్యంతో బుధవారం ఫౌండేషన్ ప్రతినిధులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబానికి నిత్యావసరాల కోసం 50 కిలోల బియ్యాన్ని అందజేసి తమ వంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడంలో బీర్ల ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అందించిన సహాయం వారికి కొంత ఊరటనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమారం గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు బొమ్మకంటి జంపయ్య, సీనియర్ నాయకులు సిద్దిరాజ్, సురేష్ గౌడ్, గిరిరాజు స్వామి, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు.

# అక్రమ క్రషర్‌పై చర్యలేవి?

- ప్రభుత్వం, అధికారుల మౌనంపై బీజేపీ నేత మాధురి చంద్ర ప్రశ్న
- అనధికార లేఅవుట్‌పై సమగ్ర విచారణకు డిమాండ్



**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని చల్లూరు గ్రామ సర్వే నంబరు 322/4లో గత కొన్ని ఏళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ క్రషర్‌పై అధికారులు శాశ్వత చర్యలు తీసుకోకపోవడం సరికాదని బీజేపీ నాయకురాలు మాధురి చంద్ర విమర్శించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం శ్రీదేవి క్రషర్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో తాము సక్రమంగానే నడుపుతున్నట్లు ఆధారాలు చూపిస్తామని చెప్పిన నిర్వాహకులు, ఇప్పటివరకు వాటిని ప్రజల ముందు ఎందుకు ఉంచలేదని ప్రశ్నించారు. గతంలో శ్రీ కన్‌స్ట్రక్షన్స్, శ్రీని డెవలపర్స్ పేర్లతో నడిచిన ఈ క్రషర్‌ను ప్రస్తుతం జీహెచ్‌కే పేరుతో నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. క్రషర్ నిర్వహణలో జరుపుతున్న భారీ బాంబు పేలుళ్ల (బ్లాస్టింగ్) కారణంగా స్థానిక ప్రజలు, పశు పక్ష్యాదులు భయాందోళనలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డీటీసీపీ అనుమతులు లేకుండానే అమాయక మధ్యతరగతి ప్రజలకు ప్లాట్లు విక్రయించి మోసం చేసిన అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. డీటీఎల్‌పీ లేఅవుట్ నం.112/2019/హెచ్ విషయంలో అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించిన నేపథ్యంలో, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ప్లాట్లు కొన్న బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నివేదికను బహిర్గతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# అనుమతులు లేని కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- శ్రీ చైతన్య స్కూల్ ఎదుట ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ధర్నా
- అనుమతి రాలేదని ధృవీకరించిన ఎంఈఓ



**తొలివెలుగు, వలిగొండ:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల భవనం ఎదుట విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ.. సదరు పాఠశాలకు కనీస బిల్డింగ్ పర్మిషన్ గానీ, ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక) అనుమతులు గానీ లేవని ఆరోపించారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా సమాధానం చెప్పలేదన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)ని ఫోన్ ద్వారా వివరణ కోరగా.. సదరు పాఠశాలకు ఇంకా అనుమతులు మంజూరు కాలేదని ఆయన స్పష్టం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. పాఠశాలకు కనీస ఆటస్థలం కూడా లేకుండా ఇరుకు గదుల్లో నిర్వహిస్తూ విద్యార్థుల భద్రతను గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సమీపంలోనే భీమలింగం కత్వ కాలువ ప్రవహిస్తుండటంతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే ఆస్కారముందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ఇలాంటి విద్యాసంస్థలపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారోజు నరసింహ చారి, సూరారం కళ్యాణ్, కనకబోయిన నందు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలి





- జనరల్ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఆబా (ఏబీహెచ్ఏ) నమోదు సంఖ్య పెంచాలని ఆదేశం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద ప్రజలకు అత్యంత మెరుగైన, నాణ్యమైన వైద్య చికిత్సలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యులను, అధికారులను ఆదేశించారు. బుధవారం భువనగిరి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు 'ఆబా' (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా మన యాదాద్రి భువనగిరి జిల్లాను మోడల్ జిల్లాగా ఎంపిక చేసినందున, జిల్లాలో ఆబా నమోదు సంఖ్యను మరింత పెంచాలని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో శానిటేషన్, బ్లడ్ బ్యాంక్, నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ విభాగం, ల్యాబ్ పరీక్షలు, టీ-హబ్ ద్వారా అందుతున్న సేవలను సమీక్షించారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి గల అవకాశాలపై చర్చించారు. ఆసుపత్రి అభివృద్ధి సంఘం (హెచ్ డీ ఎస్) సమావేశ నిర్వహణకు తక్షణమే తేదీని ఖరారు చేయాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత రాకుండా చూడాలని, సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. అరుణకుమారి, ఆర్ఎంఓ డాక్టర్ ఎ. జయలక్ష్మి, డీఎంహెచ్ఓ, నర్సింగ్ ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# పేదల సొంతింటి కల సాకారం

- ఇంద్రియాలలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం
- గ్రామ పార్టీ అధ్యక్షుడు పానగంటి లింగస్వామి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పానగంటి లింగస్వామి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో లబ్ధిదారులు కందాల లలిత, నరసింహ దంపతుల నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం లింగస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. సామాన్యుడి గొప్ప కల అయిన సొంత ఇంటి నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు మహిపాల్, వార్డు సభ్యుడు దొడ్డి సుధాకర్, బర్మావత్ శ్రీకాంత్, మాజీ వార్డు సభ్యుడు బద్దం రాజేశ్వర్, రాజారామ్, మొగిలిపాక ప్రవీణ్, సురేష్, శంకరయ్య, బద్దం రాజు, కందాల వంశీ తదితరులు పాల్గొన్నారు.



# నూకల నరేష్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

- ఘనంగా దివంగత కాంగ్రెస్ నేత జయంతి వేడుకలు
- విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్



**తొలివెలుగు, డోర్నకల్:** దివంగత కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు, స్నేహయూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల నరేష్ రెడ్డి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన సేవలు చిరస్మరణీయమని డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ కొనియాడారు. నూకల నరేష్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం ఏరువాక జంక్షన్ లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నరేష్ రెడ్డి నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజాపక్షాన నిలిచిన గొప్ప నాయకుడన్నారు. ఆయన ఆశయాలను, ఆశించిన ఆశయ సాధనను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరేష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, అభిమానులకు తన సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకల నరేష్ రెడ్డి కుమారుడు అభినవ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్, మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిజిటల్ లెర్నింగ్ శిక్షణ ప్రారంభం

- సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి: ప్రిన్సిపాల్ రాహత్ ఖానం
- రెండు రోజుల పాటు ప్రత్యేక తరగతులు

**తొలివెలుగు, రామన్నపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'అన్న, అక్క మెంటర్ షిప్' కార్యక్రమానికి అనుబంధంగా రెండు రోజుల డిజిటల్ లెర్నింగ్ శిక్షణా కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం ఈ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ నెల 17, 18 తేదీల్లో (రెండు రోజుల పాటు) ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో భాగంగా తృతీయ సంవత్సరం (ఐదో సెమిస్టర్) విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్లుగా డాక్టర్ జె. చినబాబు, డాక్టర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, డాక్టర్ జి. సునీత వ్యవహరిస్తున్నారు. ఈ శిక్షణలో విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ జనార్దన్ ముఖ్య వక్తగా హాజరై.. విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు), డిజిటల్ లెర్నింగ్ పరిజ్ఞాన వినియోగం తదితర ఆధునిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమ అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ రాహత్ ఖానం మాట్లాడుతూ.. విద్యార్థులు ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వంటబట్టించుకుని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తిపై విమర్శలు తగవు

- రైతుల సమస్యలను ప్రస్తావిస్తే రాజకీయం చేస్తారా?
- బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మల్లేశం



**తొలివెలుగు, రామన్నపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నకిరేకల్ మాజీ శాసనసభ్యుడు చిరుమర్తి లింగయ్యపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం హితవు పలికారు. బుధవారం రామన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు జరుగుతున్న నష్టాలను, వారు పడుతున్న అవస్థలను స్వయంగా గుర్తించి, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారని స్పష్టం చేశారు. అన్నదాతల సమస్యలను ప్రస్తావిస్తే వాటిని పరిష్కరించాల్సింది పోయి, ప్రతిపక్ష నాయకులపై రాజకీయ విమర్శలకు దిగడం కాంగ్రెస్ శ్రేణుల ఉదాసీనతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా అసత్య ప్రచారాలను, రాజకీయ విమర్శలను మానుకుని రైతులను ఆదుకోవడంపై దృష్టి సారించాలని మల్లేశం కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీవో ఆవుల రాములు
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచన



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఆవుల రాములు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న గుడిసెలను సందర్శించిన ఆయన, అనంతరం నిర్మాణ దశలో ఉన్న ఇండ్ల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు, అధికారులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా పక్కా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ పర్యటనలో హౌసింగ్ డీఈ ఎన్. సునీల్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఖాకీల అండతో కార్పొరేట్ దోపిడీ!





- ట్రినిటీ విద్యాసంస్థల అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి
- ఎస్ఎఫ్ఐ ధర్నాపై పోలీసుల ప్రతాపం
- పుస్తకాలు, యూనిఫాంల పేరిట వేల రూపాయల వసూళ్లు
- ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రైవేట్ విద్యాసంస్థల పేరుతో జరుగుతున్న అక్రమ పుస్తకాల వ్యాపారాన్ని ప్రశ్నించిన విద్యార్థి నాయకులపై చౌటుప్పల్ పోలీసులు ప్రతాపం చూపారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. బుధవారం చౌటుప్పల్‌లోని ట్రినిటీ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో పోలీసుల జోక్యం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్, కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యా సేవల కంటే వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా ట్రినిటీ పాఠశాల యాజమాన్యం సొంతంగా ముద్రించిన పుస్తకాలు, యూనిఫాంలను తల్లిదండ్రులు తప్పనిసరిగా కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తోందని పేర్కొన్నారు. పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాంల పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు వసూలు చేస్తున్నారని, దీంతో మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని, ప్రైవేట్ యాజమాన్యాల అక్రమాలకు అధికారుల సహకారం ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. విద్యా దోపిడీని అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎంఈఓను విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాతిరి మనోజ్, ఇరిగి వరుణ్, సాయి, గణేష్, నాని తదితరులు పాల్గొని విద్యా దోపిడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# పేదోడి ఆత్మగౌరవానికి ప్రతీక.. 'ఇందిరమ్మ ఇల్లు'

- చౌటుప్పల్‌లో నూతన గృహాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్
- లబ్ధిదారుని కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం
- ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లే ప్రభుత్వ లక్ష్యం

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనాన్ని, సొంత ఇంటి వసతిని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో లబ్ధిదారుడు చెన్నోజు మదనాచారి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును బుధవారం ఆమె రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు ఇందిరమ్మ ఇళ్లు ఎంతో దోహదపడతాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేసేలా మున్సిపల్ యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, కో-ఆప్షన్ సభ్యుడు పస్తం గంగరాములు, నాయకులు కాసోజు గోవర్ధనాచారి, మాదాని గోపాల్, పెద్దగోని రమేష్ గౌడ్, వీరమల సత్తయ్య, ఎస్కే యూసుఫ్, గణేష్, లబ్ధిదారుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఖైతాపురంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

### ఏదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

### చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



**తొలివెలుగు,చౌటుప్పల్:** మండలం ఖైతాపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిరమ్మ ఇళ్లు" పథకం కింద మంజూరైన రెండు నూతన ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన గృహాలను ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదర్శ కళాశాలలో ఇంటర్ మిగులు సీట్ల భర్తీ

- ఈ నెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- ప్రిన్సిపాల్ శివ స్వరూపారాణి ప్రకటన

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి. శివ స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆమె ఈ వివరాలను వెల్లడించారు. కళాశాలలోని సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన స్థానిక విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22వ తేదీ లోగా అవసరమైన ధ్రువపత్రాలతో కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ జగదీష్
- కళాశాలలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి




**తొలివెలుగు, రామన్నపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తక్షణమే ప్రవేశాలు పొందాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేటుకు ధీటుగా నాణ్యమైన విద్య అందుతుందని, అనుభవజ్ఞులైన సబ్జెక్టు అధ్యాపకులు ఇక్కడ బోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాలలో విశాలమైన తరగతి గదులతో పాటు ఆధునిక ప్రయోగశాలలు (ల్యాబ్స్), సుసంపన్నమైన గ్రంథాలయం (లైబ్రరీ) వంటి అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లోని ఉచిత విద్యా సౌకర్యాలను ఉపయోగించుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు

# కుష్బూ వారసురాలిద్దరూ రెడీ..



ఉత్తరాది నుంచి దక్షిణాదికి దిగుమతి అయిన నటి కుష్బూ హిందీలో బాల నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ సంచలన నటి ఆ తరువాత తెలుగులో వెంకటేష్‌కు జంటగా కలియుగ పాండవులు చిత్రంలో కథానాయికిగా పరిచయమయ్యారు. ఆ తరువాత వరుషం--16 చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. విశేషం ఏమిటంటే ఈమె తెలుగు, తమిళం భాషల్లో నటించిన రెండు చిత్రాలు విజయం సాధించాయి. ఆ తరువాత ఈ రెండు భాషల్లోనూ పలు చిత్రాల్లో నటించారు. తమిళంలో రజనీకాంత్, కమలహాసన్, విజయకాంత్, ప్రభు, కార్తీక్ వంటి నటులతో జంటగా నటించారు. కథానాయకిగా బిజీగా ఉండగానే దర్శకుడు సుందర్.సిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత రాజకీయ రంగప్రవేశం చేసి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రచార కర్తగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మరో పక్క నిర్మాతగా చిత్రాలు నిర్మిస్తున్నారు. సుందర్.సి, కుష్బూ దంపతులకు అవంతిక, ఆనందిత అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇప్పుడు వారు కూడా సినీ రంగప్రవేశం చేయడం విశేషమేమీ కాదు. చిన్న కూతురు ఆనందిత దర్శకుడు మణిరత్నం వద్ద సహాయ దర్శకురాలిగా చేరారు. పొన్నియిన్ సెల్వన్ 1, 2, థగ్‌లైఫ్ చిత్రాలకు పని చేశారు. పెద్ద కూతురు అవంతిక హీరోయిన్‌గా రంగప్రవేశం చేశారు. ఈమె లండన్‌లో నటనలో శిక్షణ పొందారన్నది గమనార్హం. ఇటీవల ఒక వాణిజ్య ప్రకటనలో నటించి తల్లి కుష్బూ ప్రశంసలు అందుకున్నారు. తాజాగా ఆరంభం అనే మలయాళ చిత్రంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో సరిత మరో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. సురేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తాజాగా ప్రారంభమైంది. అవంతిక త్వరలో తమిళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ అవుతారని ఆశించవచ్చు.

# కాన్సెప్ట్ బాగుంది కానీ... అందులో వాస్తవం లేదు: దర్శకుడు క్రిష్



దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తదుపరి మూవీ అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుందని, అందులో ఏడుగురు హీరోయిన్లు నటించనున్నారనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారంపై స్పందించిన క్రిష్.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెక్కింగ్ అడ్వెంచర్.. ఐడియా బాగుంది, కానీ ఇది నిజం కాదని అన్నారు. సోషల్ మీడియాలో పుట్టిన మరో స్క్రిప్ట్ మాత్రమేనంటూ వదంతులకు తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తానని చెప్పారు. గమ్యం మూవీతో దర్శకుడిగా పరిచయమైన క్రిష్, ఆ మూవీతో తెలుగు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని అందించిన సంగతి తెలిసిందే. తరువాత వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ వంటి ఆలోచనాత్మక చిత్రాలు, అలాగే కథానాయకుడు (ఎన్టీఆర్) వంటి బయోపిక్‌ను తెరకెక్కించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన హరి హర వీరమల్లు, ఘాటి మూవీలు గత ఏడాది విడుదలయ్యాయి.



# లొకేషన్‌లో వాగ్వివాదం

షూటింగ్ టైమ్‌లో క్రియేటివ్ డిఫరెన్స్ కామన్. డైరెక్టర్‌కీ డీవోపీకీ మధ్య ఈ విషయంలో గొడవలెక్కువగా వస్తుంటాయి. మూవీ మేకింగ్‌పై నిర్మాతకు అవగాహన ఉంటే కూడా సెట్‌లో వాదనలకు ఆస్కారం ఉంటుంది. ఈ మధ్య సెట్స్‌లో హీరోల జోక్యం కూడా ఎక్కువైందని, కొందరు హీరోలైతే డైరెక్టర్లకీ, డీవోపీలకూ షాట్ ఎలా పెట్టాలో కూడా చెబుతున్నారనీ ఇన్‌సైడ్ టాక్.. ఈ విషయంలో బాలీవుడ్ రెండాకులు ఎక్కువే చదివింది. అక్కడ హీరోయిన్లు కూడా జోక్యం చేసేసుకుంటున్నారట. వివరాల్లోకెళ్తే. యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై లేడీ స్పై థ్రిల్లర్‌గా 'ఆల్ఫా' సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అలియాభట్ లీడ్‌రోల్ చేస్తున్నది. శివ్‌రావెల్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్‌లో అలియాభట్ జోక్యం అధికమవ్వడంతో లొకేషన్‌లో పెద్ద గొడవే జరిగిందట. లొకేషన్‌లో దర్శకుడు శివ్‌రావెల్‌కు క్రియేటివ్ అవుట్‌పుట్స్‌ని అలియా ఎక్కువగా ఇస్తుండటం అసలు గొడవకు కారణమైందని వినికిడి. యాదృశ్చికంగా బాబీడియోల్ కాంబినేషన్ సీన్స్ తీస్తున్నప్పుడు కూడా ఇది జరిగిందట. ఈ విషయంలో కొంతవరకూ బాబీడియోల్ సర్దుకుపోయినా.. వ్యవహారం శృతి మించడంతో అభ్యంతరం తెలియజేయక బాబీడియోల్‌కి తప్పిందికాదు. దాంతో ఇద్దరి మధ్య ఓ స్థాయిలో వాగ్వివాదం జరిగిందట. ఈ గొడవను చల్లార్చి, షూటింగ్‌ను సజావుగా నడిపించేందుకు దర్శక,నిర్మాతలు చాలా కష్టపడాల్సివచ్చిందట. ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో ఈ విషయంపై కథనాలు వెలువడుతున్నాయి. 'అల్ఫా' సినిమా విషయంలో అలియా అధికంగా జోక్యం చేసుకోవడానికి కారణం యష్‌రాజ్ ఫిల్మ్స్ గత చిత్రాలైన వార్ 2, మర్దానీ 3 చిత్రాల ఫలితాలేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.





# సీతతో విడిపోయిన తర్వాత చాలా సంతోషంగా ఉన్నా: పార్తీబన్

సినీ నటి సీత, దర్శకుడు, నటుడు పార్తీబన్ 1990లో ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత ఇద్దరూ విడిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ఒక కుమారుడిని దత్తత తీసుకున్నారు. విడిపోయినప్పటి నుంచి పార్తీబన్ ఒంటరిగానే ఉంటున్నారు. సీత మాత్రం మరొక వ్యక్తిని పెళ్లాడి, ఆ తర్వాత ఆయనతో కూడా విడిపోయారు. సీతతో తన వివాహం, విడిపోవడంపై పార్తీబన్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... సీతతో విడిపోయినందుకు తాను ఎప్పుడూ బాధపడలేదని చెప్పారు. నిజం చెప్పాలంటే ఆమెతో విడాకులు తీసుకున్న తర్వాత చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. అయితే, ఆమెతో ఉన్న 12 సంవత్సరాలు తన జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని చెప్పారు. ఈ రోజుల్లో పురుషులు కానీ, మహిళలు కానీ వివాహం చేసుకోవడం కంటే స్వతంత్రంగా ఉండానికే ఇష్టపడతారని... ఏ మహిళ కూడా వివాహం పేరుతో పరిమితులు ఉండే జీవితాన్ని కోరుకోదని తెలిపారు. పార్తీబన్ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.



# వారణాసి ఏ జానర్ మూవీ?... రాజమౌళి సమాధానం ఇదే!

దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'వారణాసి'పై ఆసక్తి రోజు రోజుకీ పెరుగుతోంది. హీరోగా మహేశ్ బాబు నటిస్తుండగా, ఈ చిత్రం ఏ జానర్‌కు చెందిందన్న దానిపై వివిధ ఊహాగానాలు వినిపించాయి. టైటిల్ గ్లింప్స్ విడుదలైన తర్వాత కథపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక ఆటోమేటిక్ వీల్‌చైర్‌లో విలన్ పాత్రలో కనిపించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్ ఆధారంగా ఇది సైన్స్ ఫిక్షన్ సినిమా అంటూ ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారానికి స్వయంగా రాజమౌళి క్లారిటీ ఇచ్చారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'వారణాసి'కి సైన్స్ ఫిక్షన్ ఫీల్ ఉన్నా, ఇది ఆ జానర్ సినిమా కాదని స్పష్టం చేశారు. ఇది ఫాంటసీ --మైథలాజికల్ మూవీ అని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ విజయంతో ఎలాంటి ఒత్తిడి లేదని రాజమౌళి తెలిపారు. కొత్త సినిమా ప్రారంభించినప్పుడు గత చిత్రాల ఫలితాలను దృష్టిలో పెట్టుకోనన్నారు. రుద్ర పాత్రలో వృషభంపై మహేశ్ ఎంట్రీ 'వారణాసి'లో గ్రేటెస్ట్ సినిమాటిక్ మూమెంట్ అవుతుందన్నారు. దర్శకుడిగా ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్త అనుభూతి ఇవ్వాలనుకుంటానని తెలిపారు. అది కేవలం విజువల్స్ పరంగానే కాదు, భావోద్వేగాల పరంగానూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మూవీ రన్‌టైమ్ మూడు గంటల కంటే తక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నానన్నారు. పూర్తి సినిమాను ఐమ్యాక్స్ వెర్షన్‌లో తెరకెక్కించాలని భావించినప్పటికీ, కొన్ని పరిమితుల కారణంగా కొన్ని సన్నివేశాలనే ఆ ఫార్మాట్‌లో రూపొందిస్తున్నామని తెలిపారు. రామాయణం ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, దానికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు సవాలుగా ఉన్నాయని చెప్పారు. ఈ భారీ ప్రాజెక్ట్ 'వారణాసి' 2027 ఏప్రిల్ 7 న ప్రేక్షకుల ముందుకు రానుంది.

